

మహాయజ్ఞం ప్రారంభం

యాదగిరిగుట్ట పట్టణంలో అక్షయ సువర్ణ లక్ష్మీ నారాయణ మహాయజ్ఞం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. - 10లో



లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

బాలికపై లైంగికదాడి కేసులో ఇద్దరు నిందితులకు పదేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37°/24°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కుగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (మంగళవారం సాయంత్రం)

సహర్ 4-51 (బుధవారం ఉదయం)

న్యూస్‌రీల్

ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవు



ఆహారాన్ని తనిఖీ చేస్తున్న అధికారి కళ్యాణ్ చక్రవర్తి

సూర్యాపేట : ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత, పరిరక్షణ అధికారి కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నాలుగు అనుమానిత నమూనాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. నూతనకల్ లోని పలు షాపులు తనిఖీ చేసి రెండు నమూనాలు సేకరించామని , అలాగే పలు బేకరీల్లో ప్రత్యేక తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఆహార పదార్థాల్లో గాఢమైన రంగులు వాడకూడదని, ఆహార పదార్థాలు తయారు చేసే వారు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆహారంలో అధికమైన రంగుల వాడకం , మరగ బెట్టిన నూనెలను మళ్లీ వాడడం, పాడై పోయిన, తేదీ అయిపోయిన పదార్థాలను ఆహారంలో వినియోగించడం లాంటివి చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. జిల్లా పరిధిలో సేకరించిన నమూనాలను పరిశీలన కోసం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆహార భద్రత అధికారి జిల్లా ఇన్చార్జ్ కృష్ణమూర్తి ఉన్నారు.

పాడి ద్వారా ఆదాయం పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): రైతులు వ్యవసాయంతో పాటు పాడి ద్వారా కూడా ఆదాయం పెంచుకోవాలని జిల్లా పశుసంర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. చింతలపాలె మండలం దొండపాడులో సోమవారం జిల్లా పశు సంవర్ధక శాఖ, సీడ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువుల ఆరోగ్యం కాపాడుకోగలిగితే రైతులకు పాల దిగుబడితో పాటు ఆదాయం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కె. వెంకటరెడ్డి, సర్పంచ్ పద్మ, జువారి సిమెంట్ పరిశ్రమ అధికారులు గోపాలకృష్ణ మూర్తి, పద్మసింగ్ పాటిల్, పిశల్కె స్వచ్ఛంద సంస్థ సీఈఓ నాగబ్రహ్మచారి, పశు వైద్యులు మధు, ఉషారాణి పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలని వినూత్న నిరసన



పన్నులు చెల్లించాలని షాపుల ఎదుట నిరసన తెలుపుతున్న బిల్ కలెక్టర్లు, సిబ్బంది

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీలో పన్ను బకాయి చెల్లించని పలు వాణిజ్య భవనాల ఎదుట మున్సిపల్ సిబ్బంది సోమవారం ధర్నా చేశారు. షాపింగ్‌మాల్, రెస్టారెంట్ ఎదుట మున్సిపల్ బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది నిరసన తెలుపుతూ ధర్నాకు దిగారు. వసుంధర షాపింగ్ మాల్ వారు రూ.8,45,036, సాయిబృందావన్ గ్రాండ్ బిల్డింగ్ యాజమాన్యం రూ.6,96,768 బకాయిలు చెల్లించాలని, నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో షాపుల ఎదుట తాము ధర్నా చేస్తున్నామని మున్సిపల్ సిబ్బంది చెప్పారు. మున్సిపాలిటీకి చెల్లించవలసిన పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

పరిహారంపైనే ఆశ

- వడగళ్ల వానకు 14,429 ఎకరాల్లో పంటలు నష్టం
- ప్రాథమిక అంచనా వేసిన వ్యవసాయశాఖ అధికారులు
- ఎకరానికి రూ.10వేల చొప్పున సీఎం పరిహారం ప్రకటించినా ఇంతవరకూ రాని స్పష్టత



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు సైదులు. తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన ఇతను యాసంగి సీజన్‌లో 10 ఎకరాల్లో వరి సాగు చేశాడు. దీని కోసం ఎకరానికి రూ.30వేల చొప్పున సుమారు రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఈనెల 18వ తేదీన కురిసిన వడగళ్ల వర్షానికి పంట పూర్తిగా దెబ్బతిన్నది. వడగళ్ల కారణంగా వచ్చే దిగుబడితో ఎకరానికి 10వేలు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇదీ జిల్లాలో వడగళ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతుల పరిస్థితికి నిదర్శనం.

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఇటీవల కురిసిన వడగళ్ల వానకు పంటలు దెబ్బతిన్నాయి. 23 మండలాల్లో వడగళ్ల వర్షం పడినా ప్రధానంగా తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లోనే ఎక్కువగా నష్టం వాటిల్లింది. 14,429 ఎకరాల్లో నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. కానీ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.



గొట్టిపర్తిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ రామారావు నాయక్(ఫైల్)

ఎక్కువగా ఆ రెండు మండలాల్లోనే..

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో అన్ని పంటలు కలిపి దాదాపు 4.60 లక్షల ఎకరాలకు పైగా సాగవుతున్నాయి. చాలావరకు పంటలు చేతికొచ్చే దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో పలు మండలాల్లో ఈనెల 18వ తేదీన వడగళ్ల వర్షం పడింది. ఈ వర్షానికి ప్రధానంగా తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో మొత్తం 12 గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కలెక్టర్ వెంకట్రావు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పర్యటించిన అధికారులు ఈ రెండు మండలాల్లో సుమారు 14,429 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు నివేదించారు. ఇందులో వరి 12,835 ఎకరాలు, మొక్కజొన్న 44 ఎకరాలు, మామిడి తోటలు 1,300 ఎకరాలు, మిర్చి 250 ఎకరాల్లో దెబ్బతినగా.. 7,097 మంది రైతులకు నష్టం కలిగినట్లు గుర్తించారు. ఈ మండలాల్లో వడగళ్ల వాన పడగా.. పాలకవీడు, అనంతగిరి, తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి.

విధివిధానాలు రాక..

రాష్ట్రవ్యాప్తంగా వడగళ్ల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో అధికంగా పంటలకు నష్టంజరగ్గా.. పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించేందుకు సీఎం కేసీఆర్ ఆయా జిల్లాల్లో పర్యటించారు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సీఎం ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించారు. దీంతో పరిహారం వస్తే నష్టం కొంతైనా తగ్గుతుందని రైతులు ఆశపడ్డారు. ఇదే సమయంలో ఈ పరిహారం జిల్లా రైతాంగానికి వర్తిస్తుందా.. లేదా అన్న విషయంపై రైతుల్లో అయోమయం నెలకొంది. పరిహారం ఇస్తామని చెప్పినా.. నేటికీ విధి విధానాలు ప్రకటించకపోవడంతో పంట నష్టపరిహారం అందేనా..? అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో హర్షం

పరిహారం అందజేత విషయంలోనూ కౌలు రైతులను పరిగణనలోకి తీసుకుంటామని సీఎం ప్రకటించారు. దీంతో రెండు మండలాల్లో పంట నష్టపోయిన కౌలు రైతులు ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేశారు. కానీ అధికారులు ప్రాథమికంగా గుర్తించిన రైతుల్లో కౌలు రైతులు లేనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం పరిహారం పంపిణీ కోసం పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు విడుదల చేస్తేనే పంట నష్టపోయిన కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను అధికారులు చేపట్టే అవకాశం ఉంది.

పార్లమెంట్ సభ్యత్వం రద్దు అప్రజాస్వామికం



సూర్యాపేటలో నిరసన దీక్షలో మాట్లాడుతున్న పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

- పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి(సూర్యాపేట): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో కూర్చున్న ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల నిర్ణయాలను రాహుల్‌గాంధీ పదేపదే ఎత్తిచూపుతున్నారని, పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలను మాట్లాడి ప్రజల ముందు కేంద్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తుండడంతో కక్షకట్టి సభ్యత్వాన్ని రద్దు చేశారని విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం చాలా బాధాకరమన్నారు. రెండుసార్లు ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా పదవిని త్యాగం చేసిన ఘనత రాహుల్‌గాంధీదని.. అలాంటి వ్యక్తిని ఎదగకుండా అణిచివేయాలని బీజేపీ చూస్తోంన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలన రోజురోజుకూ దిగజారిపోతోందని, ప్రజలకు చెప్పేది ఒకటి.. చేస్తున్నది మరొకటన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. జైల్‌భరోలు చేసైనా రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీని జైలుకు పంపిన జనతాపార్టీ నామరూపాలు లేకుండా పోయిందని, ఇదే గతి బీజేపీ ప్రభుత్వానికి, పార్టీకి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, తుంగతుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, చివ్వెంల, ఆత్మకూర్ (ఎస్) మండలాల పార్టీ అధ్యక్షులు ధారావత్ వీరన్ననాయక్, కందాల వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

కోదాడఅర్బన్ : విద్యార్థులు చదువులో ఒత్తిడిని యోగాతో దూరం చేసుకోవచ్చని ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో హార్ట్‌ఫుల్ నెస్, రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, రామచంద్రమిషన్ జోనల్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, కోదాడ సెంటర్ కోఆర్డినేటర్ వీరప్రసాద్, కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, కళాశాల అకడమిక్ అడ్వయిజర్ పోతుగంటి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, డాక్టర్ సీహెచ్. నాగార్జునరావు పాల్గొన్నారు.

ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

సూర్యాపేటక్రైం : ప్రజలు, వాహనదారులు రోడ్లపై ప్రయాణించే సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం జాతీయ రహదారి 65పై రోడ్డు యాక్సిడెంట్ బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలించి మాట్లాడారు.



యోగా ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రతిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ నాగభూషణం, పట్టణ సీఐ రాజశేఖర్ ఉన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

ప్రజలు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను తెలుసుకున్నా. సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజావాణిలో 46 దరఖాస్తులు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి(సూర్యాపేట): ప్రజా సమస్యల పరిష్కార వేదికైనా ప్రజావాణిలో ఆయా శాఖలకు సంబంధించి 46 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావు వెల్లడించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్ కేశవ్, మోహన్‌రావులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తుల్లో తహసీల్దార్లకు సంబంధించి 27, డీఆర్‌డీఓకు 8, ఇతర శాఖలకు సంబంధించి 11 ఉన్నాయని వీటిని ఆయా శాఖలకు పంపించామన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వేసవికాలం సమీపిస్తున్నందున సంబంధించి శాఖ అధికారులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి ఎద్దడి లేకుండా రోజూ తాగునీటిని అందించాలని, నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. హీట్ వేవ్స్ వల్ల వడదెబ్బ తలగకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా సేదదీరేందుకు చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు నీరు, షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో జరిగే జనరల్ బాడీ బడ్జెట్ సమావేశాలకు సంబంధిత శాఖ అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మండల స్పెషల్ ఆఫీసర్లు తనిఖీలు చేయాలన్నారు. పోషణ్ పఖ్వాడాపై సమావేశాలు ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

సీఎంఆర్ లక్ష్యం సకాలంలో పూర్తి చేయాలి

జిల్లాలోని మిల్లర్లకు కేటాయించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎఫ్‌సీఐ అధికారులు, మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎంఆర్ ఆలస్యానికి గల కారణాలను మిల్లర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గోదాముల కొరత, ట్రాన్స్‌పోర్టు సమస్యల వల్ల సీఎంఆర్ ఆలస్యం అవుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లు సీఎంఆర్ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారని, కొంత మంది మిల్లర్ల వల్ల మిగతావారు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో ధాన్యం అధికంగా ఉన్నందున బియ్యం కోసం ప్రత్యేక గోదాము ఏర్పాటు చేసి దిగుమతి ఆలస్యం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ వాగ్యానాయక్, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో ఏప్రిల్ 3 ఏప్రిల్ 13 వరకు జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పదోతరగతి పరీక్షల నిర్వహణ, మౌలిక వసతుల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, ఎస్. మోహన్‌రావులతో కలసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రెగ్యులర్ 12,221 మంది, ప్రైవేట్ 165 మంది మొత్తం 12,386 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, వీరికి 69 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల ఉన్న రూట్‌లలో పరీక్షల సమయంలో ఆర్‌టీసీ బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, డీఎస్పీ రవి, విద్యుత్ , వైద్య , పోస్టల్, ఆర్‌టీసీ, ట్రెజరీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రీతి కేసును సీబీఐకి అప్పగించాలి

తిరుమలగిరి(తుంగతుర్తి): డాక్టర్ ప్రీతి కేసును సీబీఐకి అప్పగించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న గిరిజన విద్యార్థిని డాక్టర్ ప్రీతి.. వేధింపుల కారణంగానే చనిపోయిందన్నారు. చనిపోయి నెల రోజులు దాటినా ప్రీతిది హత్యనో, ఆత్మహత్యనో పోలీసులు తేల్చకపోవడం దారుణమన్నారు. ర్యాగింగ్‌ను నివారించడంలో విఫలమైన ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ, ఎంజీఎం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు బానోతు వసంతనాయక్, రాష్ట్ర కార్యదర్శి సునీల్ నాయక్, జిల్లా కార్యదర్శి వెంకట్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీను నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాటోతు కిషన్ నాయక్

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్చరణలతో కల్యాణతంతు ముగించారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్ , రామాచార్యులు , పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి ,ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలి



సన్మాన గ్రహీతలతో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం స్థానిక నాయకులు

కోదాడఅర్బన్ : రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ కార్డుల ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో ఉచితంగా వైద్యం అందించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు , ప్రధాన కార్యదర్శి జి. దామోదర్‌రెడ్డి, సి. చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో రాష్ట్ర కార్యవర్గంలో చోటు సంపాదించుకున్న కోదాడ ప్రాంతానికి చెందిన వారికి సోమవారం రాత్రి కోదాడలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా పెన్షన్‌ను వారి ఖాతాలో జమచేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అక్కిరాజు లక్ష్మీనర్సింహారావు(బాబు),ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు జి. వెంకటరెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాలోని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు, కోదాడ యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు వి. శ్రీనివాసరావు, వై. లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

ఇంకా అసంపూర్తిగానే..

యాదాద్రి ప్రధానాలయం ఉద్ఘాటనకు నేటికి ఏడాది

- పెరుగుతున్న భక్తుల సంఖ్య
- అసౌకర్యాలతో సతమతం
- ఇప్పటికీ కొనసాగుతున్న పనులు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి ఆలయ ఉద్ఘాటన జరిగి మంగళవారం నాటికి ఏడాది పూర్తయింది. ఇంకా భక్తులకు సరైన వసతులు సమకూరడం లేదు. రూ.1200 కోట్ల వ్యయంతో యాదాద్రి ఆలయ నగరి పూర్తి చేశారు. గత సంవత్సరం మార్చి 28న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆలయ ఉద్ఘాటన జరిగింది. ఆరేళ్ల తర్వాత స్వయంభూల దర్శనం కలుగడంతో దేశ, విదేశీ భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు సమకూరక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇవీ.. ప్రధాన సమస్యలు

- రూ.11 కోట్ల దాతల నిధులతో చేపట్టిన అన్నప్రసాద వితరణ కేంద్రం పనులు సాగుతున్నాయి. దీక్షాపరుల మండపంలో రోజు 1000 మంది భక్తుల వరకు అన్నప్రసాదం అందిస్తున్నారు.
- భక్తులకు దేవస్థానం ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాల్లో కనీసం నీడ లేదు. వేలాది మంది భక్తులు సొంత వాహనాల్లో గుట్టకు చేరుకుంటున్నారు. పార్కింగ్‌లో తమ వాహనాలను నిలిపి కొండపైకి వెళ్లే ఆర్టీసీ బస్సుల కోసం ఎండ, వానలో గంటల తరబడి ఎదురుచూస్తున్నారు.



నిర్మాణం పూర్తికాని మొదటి ఘాట్‌రోడ్డు

- రూ.50 కోట్లతో చేపట్టిన ఫ్లైఓవర్ పనులు ఇంకా పూర్తి కాలేదు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే స్వామి వారి గిరిప్రదర్శన మార్గం పనులు పూర్తికాక 2.7 కిలోమీటర్లు అస్తవ్యస్తంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది.
- శ్రీ స్వామి వారి క్షేత్రంలో వ్యాపార సముదాయాల కోసం నిర్మిస్తున్న కాంప్లెక్స్ నిర్మాణాలు పూర్తికాలేదు. దేవస్థానం బస్టాండ్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. కొండపైన రూ. 1.07 కోట్లతో చేపట్టిన బస్ బే పనులు పూర్తి కావడంలే దు. భక్తులకు కొండపైన ఎలాంటి వసతులూ లేవు.

పెరిగిన భక్తుల సంఖ్య

శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల సంఖ్య పెరిగింది. కార్తీక మాసంలో భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ప్రముఖులు, విదేశీయుల సంఖ్య సైతం పెరిగింది. ఆస్ట్రేలియా, ఇటలీ, అమెరికా, స్విట్జర్లాండ్, కెనడా వంటి దేశస్తులు శ్రీస్వామిని దర్శించుకుంటున్నారు. భక్తులు, ప్రముఖులు అధికంగా వస్తుండటంతో గతంలో కంటే ప్రస్తుతం హుండీల ఆదాయం రికార్డు స్థాయిలో రూ.2కోట్లు దాటింది.

గతంలో బాలాలయం నిర్మించిన చోట సంగీతభవన్ నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

- ప్రధానంగా ఆలయంలో దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులకు కనీసం నిలువ నీడ లేదు. దర్శనం తర్వాత కొద్దిసేపు ఆలయం ఆవరణలో కూర్చునే పరిస్థితి లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రెసిడెన్షియల్ సూట్లు అత్యాధునిక వసతులతో నిర్మించారు. దాతల విరాళాలతో నిర్మించిన వీటిని భక్తులకు అద్దెకు ఇస్తున్నారు. 14 విల్లాల్లో 70 సూట్ గదులు అందుబాటులోఉన్నాయి. ఇక్కడ బస చేసే భక్తులకు క్యాంటీన్ సౌకర్యం లేదు.
- దేవస్థానం మొదట్లో నడిపిన విధంగా 45 ఆర్టీసీ బస్సులను ఆర్థిక భారంతో 20కి తగ్గించారు. దీంతో భక్తులు పరిమితికి మించి బస్సులలో ప్రయాణం చేస్తున్నారు.

ఎన్నో మార్పులు..

యాదగిరిగుట్ట: ఈ యేడాదిలో యాదాద్రి ఆలయంలో నూతన కార్యక్రమాలకు సైతం ఆచార్యులు, అధికారులు శ్రీకారం చుట్టారు. విశేష పూజలను ప్రారంభించారు. గతేడాది జూలైలో శ్రావణ మాసం సందర్భంగా కోటి కుంకుమార్చన పూజలను తొలిసారిగా చేపట్టారు. అక్టోబర్ 31న బ్రేక్ దర్శనాలను ప్రారంభించారు. రూ.300 టిక్కెట్ రుసుముతో బ్రేక్ దర్శనం ఉదయం 9 నుంచి 10 గంటలకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. అంతే కాకుండా భక్తులకు ఇంటి నుంచే బుకింగ్ చేసుకునే విధంగా ఆన్‌లైన్ పూజల టిక్కెట్ సేవలను ప్రారంభించారు. ఇక కొండ కింద గల తులసీ కాటేజీలో రూ.21కోట్ల వ్యయంతో నిర్మించిన 240 గదుల సముదాయాన్ని జనవరి 2న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, విప్ సునిత, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావులు ప్రారంభించారు. రింగ్ రోడ్డులోని గండి చెరువు సమీపంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపాన్ని ప్రారంభించారు. కొండపైన కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను ప్రారంభించి, నిత్యం వాటి ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

ఆలేరురూరల్ : రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలేరులో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు పట్టణానికి చెందిన కటకం బాలరాజు(25) స్థానికంగా మటన్ దుకాణం నిర్వహిస్తున్నాడు.ఉదయ 6 గంటల సమయంలో బాలరాజు ఆలేరు పట్టణ శివారులోని ఆర్వోబీ వద్దకు వచ్చాడు. రైలు పట్టాలపై తలపెట్టి పడుకున్నాడు. ఈ క్రమంలో సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు బాలరాజుపై నుంచి వెళ్లగా తల, మొండెం వేరుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి ఇచ్చిన సమాచారం మేరకు భువనగిరి రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. అప్పుల బాధతోనే బాలరాజు ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చింత పండు దులపబోయి..

- చెట్టుపైనుంచి పడి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మృతి


యాదగిరిరెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి : చింతపండు దులిపేందుకు చెట్టు ఎక్కిన ఓ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి మృతిచెందాడు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సామ యాదగిరిరెడ్డి (62) ఆదివారం స్థానిక తన వ్యవసాయ భూమి వద్ద చింతపండు దులిపేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానిక రైతులు అతడిని తొలుత నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మనోరమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

లాడ్జిలో ఆత్మహత్య

- మృతుడు సూర్యాపేట వాసి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ లాడ్జీలో సూర్యాపేటకు చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని సోమవారం రాత్రి గుర్తించిన సిబ్బంది ఖమ్మం వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూర్యాపేటకు చెందిన అప్పం నిహార్ ఖమ్మంలోని స్టేషన్ రోడ్డులో గల ఓ లాడ్జీలో ఆదివారం గది అద్దెకు తీసుకున్నాడు. ఆయన సోమవారం గదిలో ఉరివేసుకోగా, పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

చండూరు వాసికి డాక్టరేట్


నిర్మల (ఫైల్)

చండూరు : చండూరు పట్టణానికి చెందిన గన్నవరం నిర్మలకు ఉస్మానియా యూనివర్సిటీ సోమవారం డాక్టరేట్ ప్రకటించింది. నిర్మల ఉస్మానియా తెలుగు శాఖ నుంచి ఆచార్య సాగి కమలాకర్ శర్మ పర్యవేక్షణలో ముకురాల రామిరెడ్డి సాహిత్యం –సమగ్ర పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం నిర్మల దేవరకొండ కేజీబీవీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తోంది.

రీజినల్ రింగురోడ్డు సర్వే పనులు అడ్డగింత

- సర్వే ప్రాంతంలో బైఠాయించి రైతుల నిరసన
- అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్
- వెనుదిరిగిన సర్వే బృందం సభ్యులు, రెవెన్యూ అధికారులు


చౌటుప్పల్ : ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి

చౌటుప్పల్ : మండల పరిధిలోని నేలపట్ల, చిన్నకొండూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో రీజినల్ రింగు రోడ్డు కోసం భూమిని సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను సోమవారం రైతులు అడ్డుకున్నారు. సర్వే చేసేదేలేదంటూ వాగ్వాదానికి దిగారు. ఉన్న రోడ్లు చాలు– కొత్త రోడ్లు వద్దు, పెద్దల కోసం కాకుండా పేద రైతులను దృష్టిలో ఉంచుకొని అలైన్‌మెంట్‌ను మార్చాలి, భూమికి భూమి ఇవ్వాలి, బహిరంగ మార్కెట్ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రాణాలైనా అర్పిస్తాం, రింగురోడ్డుకు భూములు మాత్రం ఇవ్వబోమని నినాదాలు చేశారు.

రోడ్డుపై బైఠాయించి..

భూసేకరణ కోసం వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు, రైతు సంఘం నాయకులు ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పాకే ఇక్కడి నుంచి కదులుతామని భీష్మించారు. అదే క్రమంలో మందోళ్లగూడెం గ్రామ శివారులోని సూపర్‌గ్యాస్ కంపెనీ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు పేరిట భూములను లాక్కొని తాతలకాలం నుంచి వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తమను రోడ్డున పడేయొద్దని వేడుకున్నారు.

ఆర్డీఓ నచ్చజెప్పినా..

సర్వే కోసం క్షేత్రస్థాయికి వెళ్లిన తహసీల్దార్ శ్యాం సుందర్‌రెడ్డి, డివిజన్ సర్వేయర్ వెంకటయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు, మండల సర్వేయర్ మురళీధరన్‌ను రైతులు అడ్డుకున్నారు. దీంతో విషయాన్ని వారు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆ క్రమంలో ఆర్డీఓ కంచర్ల వెంకట ఉపేందర్‌రెడ్డి రైతుల వద్దకు వెళ్లారు. నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రైతులు ససేమిరా అనడంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తదుపరి ఉత్తర్వుల మేరకు నడుచుకుంటామని తెలిపారు. కాగా తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, భూమికి భూమి ఇవ్వాలని, పరిహారంగా బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బూర్గు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. అలా చెల్లించని పక్షంలో భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తెలిపారు.

పురుగు మందు డబ్బాలు, పెట్రోల్ బాటిళ్లతో...


పెట్రోల్ డబ్బాలతో వచ్చిన మహిళా రైతులు

తమ భూములను సర్వే చేసేందుకు సంబంధిత సర్వే బృందం వస్తుందన్న సమాచారాన్ని రైతులు ముందుగానే తెలుసుకున్నారు. అడ్డుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. మహిళలు, పురుషులు నిరసన, ధార్నా చేయాలని వచ్చారు. బలవంతంగా భూసేకరణ చేయాలని ప్రయత్నిస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని, తమ చావులకు అధికారులే కారణమవుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగా మహిళా రైతులు తమ వెంట తెచ్చుకున్న పురుగు మందు డబ్బాలు, పెట్రోల్ బాటిళ్లను చూపుతూ నిరసనవ్యక్తం చేశారు. ఆత్మహత్యలకైనా సిద్ధమే కానీ పంటపొలాలను రింగ్ రోడ్డుకు ఇవ్వబోమని తేల్చిచెప్పారు.

ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ దుర్మరణం

- కేతేపల్లిలో స్కూటీని ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో జ్యోతిలక్ష్మి మృతి


జ్యోతిలక్ష్మి (ఫైల్)

కేతేపల్లి: హైవేపై కేతేపల్లిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. కేతేపల్లికి చెందిన పిల్లలమర్రి జ్యోతిలక్ష్మి(43) స్థానికంగా ఇండేన్ వంట గ్యాస్ సిలిండర్‌ల డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నారు. మధ్యాహ్నం జ్యోతిలక్ష్మి తన స్కూటీపై ఇంటి నుంచి గోదాం వద్దకు బయలుదేరింది. మార్గమధ్యలో డీపాల్ పాఠశాల సమీపంలోని జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా నకిరేకల్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. అనంతరం ఆటో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన జ్యోతిలక్ష్మి తలపై ఆటో ఎగిరి పడడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఆటో డ్రైవర్ దాస్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతురాలు జ్యోతిలక్ష్మికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె భర్త ఇదే మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గాయపడిన దాస్‌ను చికిత్స నిమిత్తం మొదట నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోస్టుమార్టం నిమిత్తం జ్యోతిలక్ష్మి మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. నకిరేకల్ ఆస్పత్రిలో జ్యోతిలక్ష్మి మృతదేహాన్ని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం వేర్వేరుగా సందర్శించి నివాళులు అర్పించారు.

బైక్, టాటాఏస్ ఢీకొని..

మఠంపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని రాఘునాథపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లికంటి పాపయ్య(54) పని నిమిత్తం బైక్‌పై మఠంపల్లి వైపు వెళ్తున్నాడు. గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్ ఢీకొనడంతో పాపయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలి


సమస్యలు తెలుసుకుంటున్న యూసఫుద్దీన్

కట్టంగూర్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ఐక్యంగా కృషి చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర స్థాయి పరిశీలకుడు ఎండీ యూసఫుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్ ఉన్నత పాఠశాలల్లోరికార్డులను, పరిశీలించి మాట్లాడారు. కొత్త ప్రశ్న పత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

నాన్నలేని లోకంలో ఉండలేనని..

- రైలు కిందపడి కుమారుడి ఆత్మహత్య
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- ఆలేరు మండలం పటేల్‌గుడెంలో విషాదం


కార్తీక్ (ఫైల్)

ఆలేరురూరల్ : తండ్రి అకాల మృతిని జీర్ణించుకోలేకపోయిన కుమారుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జనగాం జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా ఆలేరు మండలం పటేల్‌గుడేనికి చెందిన పిక్క ఆంజనేయులు, నాగమణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇద్దరు కుమార్తెల వివాహం చేయగా, రెండవ కుమారుడు కార్తీక్(19) భువనగిరిలోని జాగృతి ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆరు నెలల క్రితం తండ్రి ఆంజనేయులు గుండెపోటుకు గురై మరణించడంతో కార్తీక్ తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు, అప్పటి నుంచి తండ్రినే తలుచుకుంటూ కుమిలిపోతూ.. చిన్న నాటి నుంచి నేటి వరకు నాన్న జ్ఞాపకాలను గుర్తుకుచేసుకుంటూ...మదన పడిపోతున్నాడు. ఇదే క్రమంలో తండ్రి లేని లోకంలో తాను ఎందుకు అనుకున్నాడో ఏమో కానీ.. కళాశాలకు వెళుతున్నానని చెప్పి జనగాం జిల్లాలోని యశ్వంతాపూర్ వాగు వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు పట్టాలపై మృతుదేహం పడి ఉన్న విషయాన్ని గుర్తించిన ఓ ట్రైన్ డ్రైవర్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి పంచానామా జరిపారు. మృతిని వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ మృతితో ఆలేరు మండలం పటేల్ గుడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నతనం నుంచి నాన్నతో ఉన్న ఆప్యాయతను తట్టుకోలేని కొడుకు మరణ వార్త విని కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

బీఆర్‌ఎస్ ర్యాలీలో దుండగుల చేతివాటం

- కనగల్‌లో ముగ్గురు నాయకుల జేబులు కత్తిరించి రూ.76వేల నగదు తస్కరణ

కనగల్: బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా నిర్వహిస్తున్న ర్యాలీలో దుండగులు చేతివాటం ప్రదర్శించారు. ర్యాలీగా వెళ్తున్న ముగ్గురు న్యాయకుల జేబులను కత్తిరించి రూ.76వేల నగదుతో ఉడాయించారు. కనగల్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో పాటు నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఎంపీపీ కరీంపాష, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి నర్సిరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు వచ్చారు. అయితే వీరికి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చి స్వాగతం పలికి ర్యాలీ తీసారు. ఆ ర్యాలీ ఆత్మీయంగా, హడావుడిగా ముందుకు సాగుతున్న క్రమంలో దుండగులు పలువురి జేబులు కత్తిరించుకుపోయారు. ర్యాలీ నుంచి సభకు చేరుకునేలోగా వారు జేబులు చూసుకుని ఒక్కసారిగా అవాక్కయ్యారు. మందడి సైదిరెడ్డి జేబులోంచి రూ.50,000, ఎంపీపీ కరీంపాష జేబులోంచి రూ.8000, రైతుసంఘం కనగల్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి నర్సిరెడ్డి జేబులోంచి రూ.18000నగదును దుండగులు కొట్టేసారు. నాయకుల జేబులకే దొంగలు కన్నం వేయడంతో ఒకింత అక్కడికి వచ్చిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు.

మిర్యాలగూడలో వేడెక్కుతున్న రాజకీయం..!

- రోడ్డుపై సీపీఎం సభ ఏర్పాటుపై కేసు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడలో రాజకీయం వేడెక్కుతోంది. నియోజకవర్గంలో సీపీఎం పోటీ చేసి తీరుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించిన మరుసటి రోజే సభ నిర్వహణపై కేసు నమోదు కావడం గమనార్హం. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య ఆదివారం మిర్యాలగూడకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన సీపీఎం శ్రేణులు.. మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద సాగర్‌రోడ్డుపై భారీగా స్టేజీ ఏర్పాటు చేసి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం మాట్లాడారు. కాగా సీపీఎం నాయకుడు డబ్బికార్ మల్లేష్ కేవలం మైక్ మాత్రమే ఏర్పాటు చేసుకుంటామని పోలీసుల నుంచి అనుమతి తీసుకుని సాగర్‌రోడ్డు ఒక వైపును బ్లాక్ చేసి బహిరంగ సభను ఏర్పాటు చేశారని, దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనాలను కూడా మళ్లించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని.. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఏఎస్‌ఐ చంద్రయ్య రాత పూర్వకంగా టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సైదిరెడ్డి సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్‌పై 188, 314 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దుర్మరణం
- మరో నలుగురికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- డీసీఎం రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొట్టడమే ప్రమాదానికి కారణం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో


ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనం

వేములపల్లి : పుట్టిన రోజు వేడుకలకు హాజరై తిరిగెళ్తున్న ఓ కుటుంబానికి మార్గమధ్యలో అనుకోని ఆపద ఎదురైంది. డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు ఆ కుటుంబంలోని ఇద్దరిని కబళించగా మరో ముగ్గురికి ఆస్పత్రి పాల్జేసింది. వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారు నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన గొడ్డేటి మధులత(22), గొడ్డేటి నర్సయ్య(75), గొడ్డేటి బాలాజీ, గొడ్డేటి సోమమ్మ, గొడ్డేటి కోటేష్, సాత్విక్‌లు సోమవారం తమ ఆటోలో మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామానికి వచ్చారు. నర్సయ్య తమ్ముడి మనుమరాలైన నడ్డి మంజులకృష్ణయ్య కుమారుడి మొదటి పుట్టిన రోజు వేడుకలకు హాజరై ఆనందంగా గడిపారు. వేడుకల అనంతరం సాయంత్రం తిరిగి అదే ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో శెట్టిపాలెం గ్రామ శివారులోగల మిరియం అనాథాశ్రమం వద్దకు చేరుకోగానే అదే సమయంలో సమీపంలో మిల్లు నుంచి తవుడు లోడ్‌తో డీసీఎం వాహనం వేములపల్లి వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఆటోను ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న మధులత ఒక్కసారిగా కిందపడడంతో డీసీఎం వాహనం ఆమెపై వెళ్లగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన సోమమ్మ, నర్సయ్య, బాలాజీ, కోటేష్, సాత్విక్‌లను మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. కాగా తీవ్రంగా గాయపడిన నర్సయ్య చికిత్స పొందుతూ మృతిచెందగా, సోమమ్మ పరిస్థితి విషమంగా ఉందన్నారు. మృతిచెందిన మధులత, నర్సయ్య మృతదేహాలను వేములపల్లి ఎస్‌ఐ శ్రీను సందర్శించి మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతిచెందిన మధులత మిర్యాలగూడ పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. కొన్ని నిమిషాల్లో ఇంటికి చేరుకునే సమయంలో డీసీఎం రూపంలో వారిని మృత్యువు కబళించడంతో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.


మధులత (ఫైల్)


నర్సయ్య మృతదేహం

బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేయాలి...

నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై గల ఏడుకోట్ల తండా నుంచి మండలంలోని అన్నపురెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వరకు పారిశ్రామిక ప్రాంతంగా గుర్తించి బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా మిల్లుల నుంచి రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాల కట్టడికి మిల్లుల యజమానులు, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలు గ్రామాలకు చెందిన వాహనదారులు పేర్కొంటున్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్ తనిఖీ

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని జనని డయాగ్నస్టిక్ సెంటర్‌ను సోమవారం డీఎంహెచ్‌ఓ కోటాచలం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ల్యాబ్‌లోని సామగ్రిని పరిశీలించారు. సామగ్రి డేట్ ఎక్స్‌పైరీ అయినట్లు, ల్యాబ్ అనుమతి రెన్యువల్ సంవత్సరం క్రితమే ముగిసినట్లు గుర్తించారు. కంప్యూటర్, రిజిస్టర్ తనిఖీ చేసి మాన్యువల్ రిజిస్టర్‌లో ఐడీ, కంప్యూటర్ రిజిస్టర్‌లో ఐడీ ఒకటిగా లేదని గుర్తించారు. అంతే కాకుండా రక్త పరీక్ష కోసం వచ్చిన వారి వివరాలు పొందు పర్చాలని సూచించారు. ఈ నెల 25న గాంధీనగర్‌కు చెందిన వట్టి గంగరాజు షుగర్ పరీక్ష చేయించుకోగా తప్పుడు రిపోర్టు ఇచ్చారని, అతడి ఆరోపణ మేరకు పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పుడు రిపోర్టు ఇవ్వడమే కాకుండా మరో గంగరాజు రిపోర్టును పొరపాటున ఇచ్చామని పేర్కొంటున్నట్లు తెలిపారు. ఆ గంగరాజు పూర్తి వివరాలు లేకపోవడంతో నిర్వాహకులు మరో గంగరాజును సృష్టించారా అనే కోణంలో విచారణ చేపడుతున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ల్యాబ్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట డెమో అధికారి అంజయ్య ఉన్నారు.

ట్రిబ్యునల్ తీర్పు అమలు చేయకుంటే కఠిన చర్యలు

- వృయో వృద్ధులు, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ చైర్మన్ వెంకట ఉపేందర్‌రెడ్డి


కేసులను విచారిస్తున్న ట్రిబ్యునల్ చైర్మన్ వెంకట ఉపేందర్‌రెడ్డి

చౌటుప్పల్ : ట్రిబ్యునల్ తీర్పు అమలు చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వృయో వృద్ధులు, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ చైర్మన్ కంచర్ల వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. తమ పోషణను పట్టించుకోవడం లేదంటూ వలిగొండ మండలం గొల్లేపల్లి గ్రామానికి చెందిన జోగు శంకరయ్య, చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన పోగుల లక్ష్మమ్మ ఇటీవల ట్రిబ్యునల్‌లో చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారులతో పాటు వారి కుమారులను పిలిచి వాదనలు విన్నారు. జోగు శంకరయ్యకు ఇద్దరు కుమారులు నెలకు 4వేల వంతున, పోగుల లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు నెలకు 3వేల చొప్పున పోషణ ఖర్చులకు చెల్లించాలని తీర్పు నిచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ట్రిబ్యునల్ తీర్పును తూచా తప్పకుండా పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జన్మనిచ్చి పెంచి పోషించిన తల్లిదండ్రులను కడవరకు కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. ఫిర్యాదులు చేసే పరిస్థితులు తల్లిదండ్రులకు కల్పించొద్దన్నారు. తల్లిదండ్రుల పట్ల ప్రస్తుతం తాము అవలంభిస్తున్న కఠిన వైఖరి భవిష్యత్తులో తమవరకు రాకుండా చూసుకోవాలన్నారు. విచారణలో ట్రిబ్యునల్ సభ్యుడు, న్యాయవాది ముత్యాల సత్తిరెడ్డి, సెక్షన్ అధికారి సురేంద్ర శర్మ, తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో 35 గొర్రెలు మృతి


చౌటుప్పల్ : గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న జైకేసారం గ్రామస్తులు

చౌటుప్పల్ : కుక్కల దాడిలో 35గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన మండల పరిధిలోని జైకేసారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మందుల ఐలయ్య, కోళ్ల పాపమ్మ రోజువారీగా తమ గొర్రెలను సాయంత్రం దొడ్లో తోలారు. అర్ధరాత్రి దాటాక కుక్కల దండు దొడ్లోకి వెళ్లి గొర్రెలపై దాడి చేశాయి. ఈ దాడిలో 35 గొర్లు మృత్యువాతపడ్డాయి. బాధితులు, గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న పశువైద్యాధికారి పృథ్వీరాజ్ ఘటనా స్థ లానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. కాగా, గొర్రెలు మృతితో నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని కాపరులు బోరున విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

సల్కునూరులో ఏడు మేక పిల్లలు..

వేములపల్లి : మండలంలోని సల్కునూరు గ్రామానికి చెందిన లొడంగి సైదులు మేకలను పెంచుతూ ఉపాధి పొందుతున్నాడు. ఇంటి ఆవరణలో ఉన్న ఏడు మేకపిల్లలపై సోమవారం మధ్యాహ్నం కుక్కల గుంపు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. జీవనాధారమైన మేక పిల్లలు మృతిచెందడంతో ఆర్థికంగా నష్టపోయానని బాధితుడు వాపోయాడు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

మిర్యాలగూడ అర్బన్ : సరైన వైద్య సేవలు అందని కారణంగానే వ్యక్తి మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం పట్టణంలోని ఓ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలం రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ మల్లు (43) గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న మల్లు సోమవారం మృతిచెందాడు. సరైన చికిత్స అందకపోవడంతోనే మల్లు మృతిచెందాడని కుటుంబ సభ్యులు కొంత సేపు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. పెద్దల జోక్యంతో విరమించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

రామగిరి(నల్లగొండ): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. ఆయా మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండలం ఇండ్లూరు గ్రామానికి చెందిన ఔరెండి సత్యనారాయణ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బ్యాంకు పని నిమిత్తం సోమవారం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. బైక్ సైడ్ స్టాండ్ తీసుకోకుండా వెళ్తుండగా మల్లేపల్లివారిగూడెం చర్చి సమీపంలో స్థానికులు చెప్పారు. బైక్ రన్నింగ్‌లో ఉండగానే స్టాండ్ తీస్తుండగా అకస్మాత్తుగా అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో సత్యానారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

అదుపు తప్పి కారుబోల్తా పడడంతో..

మద్దిరాల: నూతనకల్ మండలం బిక్కుమళ్ల గ్రామంలో జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి నలుగురు వ్యక్తులు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గోరెంట్ల శివారులోని 365 జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి హైవే కిందికి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. దీంతో అందులో ఉన్న ఓ వ్యక్తికి గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు.

ఆటో బోల్తా పడడంతో..

అనంతగిరి: అనంతగిరి మండల పరిధిలోని ఆటో కొత్తగోల్‌తండా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కన్నెవీడు గ్రామానికి 13 మంది మిరపకాయ కూలీలతో బయల్దేరింది. మార్గమధ్యలో అనంతగిరి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని రహదారిపై ఉన్న గుంతలో అదుపుతప్పడంతో బోల్తాకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 13 మందిలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు బ్రేకులు పనిచేయక..

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామానికి చెందిన అన్నమనేని నవీన్ పని నిమిత్తం కారులో సూర్యాపేటకు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో అక్కలదేవిగూడెం వద్ద కారు బ్రేకుల్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నవీన్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సూర్యాపేటకు తరలించారు.

రెండు కార్లు ఢీకొని ..

పెద్దఅడిశర్లపల్లి : కొండమల్లేపల్లి మండలం ఫకీర్‌పురం గ్రామానికి చెందిన కాటి ముత్తయ్య,కాటి మురళి కుటుంబ సభ్యులు సూర్యాపేట జిల్లా ఎడబెల్లి గ్రామంలో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం తిరుగు ప్రయాణమై ఇంటికి వస్తుండగా అంగడిపేట ఎక్స్ రోడ్ జంక్షన్ వద్దకు రాగానే పెద్దవూర నుంచి వేగంగా వస్తున్న మరో కారు ఢీకిట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.వారిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముత్తయ్య అల్లుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.